భావసంశుద్ధి కలుగుటే భక్తియగును
పుణ్యకార్యాలు చేయుటే పూజలగును
పరులకుపకారమొసగుటే తపసుయగును
మరువబోకు డిటువంటి మంచి మాట.

తనదు తప్పుతాను తరచుంగసుజ్ఞాని
పరుల తప్పులెల్ల వెదకువాడు
తనను తెలియలేడు తనతప్పు తెలియదు
ఇతని కంటె మూర్ఖుడవని మేలు.

ప్రేమస్వరూపులారా!

భగవంతు డందించిన అమోఘమైన వరప్రసాదమే యీ మానవ శరీరము దీనిని సక్రమమైన మార్గమున అనుభవించినప్పుడే జీవితము సార్థకమవుతుంది. శరీరము కర్మను బంధిని. కర్మాచరణా నిమిత్తమై అందించినది యీ శరీరము. ధర్మాచరణనిమిత్తమై, ధర్మసాధన నిమిత్తమై అందించిన పనిముట్టు యీ శరీరము. అట్టి శరీరమును దుర్మార్గమున ప్రవేశపెట్టి అన్యాయ అక్రమ అనాచారములలో దీనిని నింపి దీనిని అపవిత్రముగావించి కల్మషము చేయుటము మానవత్వానికి విరుద్ధమైన మార్గము

మానవ శరీరమును అనుభవించుటలో మూడు విధములైన పద్ధతు లున్నవి. ప్రాకృతమైన యీ జగత్తునందు లౌకికమైన భోగభాగ్యములు అనుభవించే నిమిత్తము యీ యొక్క శరీరమును ప్రసాదించినాడని భ్రమించి దీనిని పెడమార్గము ప ట్టించి చేయరాని పనులు, పోరాని చోటులు దీనిని ప్రవేశపెట్టి అపవిత్రము గావించుకోటం యిది అధమ మార్గమునకు చెందిన మానవత్వము. కర్తవ్య నిమిత్తమై తన యొక్క కాయమును సక్రమముగా భావించుకుంటూ పాలించుకుంటూ సంస్కార కార్యక్రమములను సరైన రీతిగా చూచుకుంటూ కర్తవ్యమును నిర్వర్తించుకొని పవిత్రము గా చేసుకోటము ఇది రెండవ మార్గము. తన కర్తవ్య కర్మలను నిర్వర్తించుకోటమే కాకుండా మధ్యమధ్య పరోపకార సంబంధమైన కర్మములలో ప్రవేశించటము, భగవత్సంబంధమైన చింతనము చేయటము యీవిధముగా యీ దేహమును సార్థకము గావించుకోటము యిది మూడవ మార్గము. కర్తవ్యమునందే ప్రవేశించక కాయము సార్థకము గావించుకొనే నిమిత్తమై రాత్రింబవలు సేవలలో పాల్గొని, భగవచ్చింతనలో తనయొక్క కాయమును సద్వినియోగము పరచుకోటము యిది నాల్గవ మార్గము. వీటినే అధముడు, మధ్యముడు, ఉత్తముడు, ఉత్తమోత్తముడు అనే స్థానములకు

318108802

దీనిని తీసుకు వచ్చారు. భగవంతుడు అనుగ్రహించిన యీ వరప్రసాదమైన యీ దేహమును భగవంతునికి అందించటము లోపల పవిత్రమైనదిగను, సార్థకమైనదిగను నిత్యసత్యమైనదిగను, మాలిన్య రహితమైనదిగను మనము చేసుకొని తద్వారా భగవంతుని సన్నిహితము గావించుటయే మానవుని ప్రధానమైన కర్తవ్యము.

ఇట్టి పవిత్ర సార్థక మార్గములను అనుసరింప చేయుటకు భారతీయ సంస్కృతి యందు భక్తి ప్రధానమైన మార్గము ప్రధానమైన స్థానము నందించారు. భక్తి అనగా కేవలము పూజలు చేయుటము, వ్రతములు ఆచరించుటము, క్షేత్రములకు పోవటము, దేవాలయములకు పోవటము యిత్యాది సత్కర్మలే భక్తికి చిహ్నములని భావిస్తూ వుంటారు. ఇవన్నియు కేవలము భక్తికి ప్రాథమిక సోపానములు మాత్రమేగాని ఇవి భక్తి అని పించుకోవు. అయినా వీటిని మనము వదలనక్కరలేదు. వీటిని ఆచరిస్తూ అందిస్తూ యితరులకు అందిస్తూ క్రమక్రమేణా మనము ఒక వున్నతస్థాయి యైన యీ భక్తిస్వరూప పదము లో మనము ప్రవేశించాలి. భక్తి అనగా కేవలము ఫలప్రదానమైన సంకల్పము చేత మనసును మాలిన్యము పరచుకొనక నిర్మలమైన ప్రేమతో భగవంతుని ఆరాధించటమే భక్తి. ఫలాపేక్షరహితమైన, ప్రతిఫలాపేక్ష సంసర్గము చేత మాలిన్యము పొందక, కేవలము స్వార్థరహితమైన పరమప్రేమను పరమాత్మునిపైన ప్రసరింపచేయుటయే భక్తి. ఏదో కారణములచే ఏర్పడిన ప్రేమ భక్తి కానేరదు. కారణరహితమైన భక్తి ప్రేమను ఆవిర్భవింప చేసుకోవాలి. దీనినే పెంపొందింప చేసుకోవాలి. నది సముద్రము మీదను, లత వృక్షము మీదను, నక్షత్రములు ఆకాశము మీదను యేవిధముగా సహజమైన మార్గమును అనుసరిస్తుందో అదే విధముగా మానవుని సహజమైన ప్రేమ పరమాత్ముని పైన ప్రసరించాలి. పరమాత్ముని వైపున ప్రవహించాలి. ఇది కృత్రిమమైనదిగా రూపొందరాదు. ఎక్కడ పుట్టినా నది సముద్రములో చేరుటకై తాను యనేక విధములైన శ్రమకు ఓర్చుకొని అక్కడకు ప్రయాణము సల్పుతుంది. ఇది నది యొక్క సహజము. కారణము నదికి అది స్వస్థానము. అదే విధముగా ఎట్టి ఫలాపేక్ష లేకుండా మానవుని యందు వుండిన నిర్మలమైన ప్రేమను పరమాత్ముని వైపు ప్రసరింప చేయుటయే సరియైన భక్తి.

ఎన్నియో ఫలములను మనస్సునందుంచుకొని, కొన్ని అభీష్టములను మనసునందుంచుకొని వాటిని ఫలింపచేసే నిమిత్తమే పరమాత్ముని ప్రార్థించుటము యిది సరైన భక్తి కానేరదు. ఇది కేవలము రజో తమో గుణముల యొక్క భక్తిగా రూపొందుతుంది. రావణ, కుంభకర్ణ, కంస యిత్యాది మహా భక్తులు కేవలము రజోగుణ తమోగుణ సంబంధము చేత పరమాత్ముని ప్రార్థించి మహాశక్తులను సంపాదించుకున్నారు. ప్రతిఫలాపేక్ష నిమిత్తమై ప్రార్థించిన యీ అభయములు, ఫలములు కేవలము స్వార్థ స్వప్రయోజన నిమిత్తమై వినియోగించుకోటం చేత సాత్వికము

318108803

...ఘగంటి పోతుంది. కడపటికి యిట్టి శక్తులను పొంది నట్టి మహా భక్తులు కూడను తమ ఆరాధన దేవతపైననే యుద్ధమునకు సిద్ధమయ్యారు. ఇట్టి వారలకే ప్రేమకు బదులు ద్వేషము యేర్పడుతుంది. అభీష్టములు విఫలమాయెనా ద్వేషము ప్రారంభమవుతుంది. అభీష్టములు నెరవేరినా అహంకారము ప్రారంభమవుతుంది. కనుక ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలము పరమాత్మని నిమిత్తమై మేము ప్రార్థిస్తున్నాము ప్రేమిస్తున్నాము అనే సత్సంకల్పము అభివృద్ధి పరచుకున్నవారే సరైన భక్తులు. ఇట్టి భక్తుల నిమిత్తమై తానే వారి స్థానమునకు చేరి వారిని అనుగ్రహిస్తాడు. అడిగి అడిగి మనము అందుకున్న అభీష్టముల చేత మనము యే మాత్రము సరైన అభివృద్ధి పొందరదు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి యేది అవసరమో తానే చూచుకుంటాడు నిజమైన భక్తునకు.

అడుగకవే ఓ మనసా! అడుగకవే ఓ మనసా!
అడుగు కొలది అది అడుగున పడునని
అడుగకున్న పని వడిగా అగునని ॥అడుగకవే॥
అడుగని శబరిని ఆదరించడే
అడుగక తనకై మడుగు జటాయువు
కడకు నేగి సద్గతి కల్గించడే ॥అడుగకవే॥

అడిగిన దశరధునకు కూడను యింత అంత్యకాలములో నీరు విడచలేదు రామచంద్రుడు. అడగని జటాయువునకు అంత్య కర్మలంతా ఆచరించాడు రామచంద్రుడు. అడగవలసినది ఒక్కటే. నీవు తప్పనాకు అన్నము అక్కరలేదని కోరికను కోరినప్పుడు అన్నీ తానే చూచుకుంటాడు

కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి పుష్పములకై ప్రీతియేల
అడిగిన పాలిచ్చు కామధేనువె రాగ
ధనమిచ్చి ఆవును కొనగనేల
మండెడు కాంతితో మేరు పర్వతముండ
వెండి బంగారుకై వెతకనేల
భక్తి శక్తి ముక్తులనిచ్చెడి పరమాత్మయే వుండ
పాడు సంసారంబు కోరనేల.

తనను పొందితే అన్నీ పొందినట్లే. తన ప్రేమకు పాత్రుడైతే జగత్తుకు పాత్రుడైనవాడే జగత్తును సాధించినవాడే. ఆశకు దాసుడైన జగమంతటికిన్ తాను దాసుడే కదా. ఆశ జయించిన వానికి జగత్తే దాసుడౌతుంది. కనుక యిట్టి భగవంతుడు ఏ కోరికగా అందజేస్తాడు, ఆదరిస్తాడు, అక్కున చేర్చుకుంటాడు. సప్తనులు తమ పూరా

318108804

కోర్కైన జలము నిమిత్తమై ఆకసము వైపు చూస్తూ, తమ యొక్క శక్తి సామర్థ్యముల చేత నాశకు గురై వుంటాయి. అట్టి పక్షులయొక్క ప్రార్థనలు అంగీకరించి మేఘములో క్రిందికి దిగి వర్షము నందించి వాటిని పోషిస్తాయి. ఊయలలో వుండిన చంటి బిడ్డ తల్లి వడిలో చేరటానికి ఆశించే సమయములో ఆ ఊయలలో వున్న బిడ్డ ఎగిరి తల్లి వడిలో పడలేదు. ఆశక్తి తనకు లేదు. కనుకనే తల్లి ఊయల దగ్గరకు వచ్చి వంగి ఆ బిడ్డను తన ఒడిలో కూర్చోబెట్టుకుంటుంది. అదే విధముగనే తన నిమిత్తమై ప్రార్థన చేసే భక్తునకు తానే దిగి వచ్చి తాను అనుగ్రహిస్తాడు.

ఈ ప్రార్థనలు ప్రేమ ప్రధానమైనవి. ప్రేమ నామము నుండియే పుట్టినది. నామము ప్రేమకు తల్లివంటిది. నామము నుండి ప్రేమ పుట్టి ప్రేమనుండి పరమాత్ముడు పుడుతున్నాడు. కనుక పరమాత్మ తత్వమునకు ప్రేమ ఆధారము. ప్రేమకు నామము ఆధారము. నామమునకు భావము ఆధారము. ఈ అన్నింటికి ఇచ్ఛాశక్తి అత్యవసరము. ప్రతి ఒక్కదానికి మనము వేరుగా ప్రయత్నించ నక్కరలేదు. మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః. నాయనా! నీవు నా అంశమే. నీవు ప్రపంచ అంశము కాదు. పంచ భూతముల అంశము కాదు. నా అంశము అని చెప్పిన వాక్యమును ఎంతవరకు విశ్వసిస్తున్నావు. పదములను వుచ్ఛరించుకున్నామే గాని, పదముల యొక్క ఆచరణలో అనుభూతిని అందుకోటానికి ప్రయత్నించటంలేదు. అమృతస్య పుత్రః అనింది భగవద్గీత. నాయనా నీవు అమృత పుత్రుడవు మృతపుత్రుడవు కాదు. నీవు చిన్మయ పుత్రుడేగాని కేవలము మృణ్మయ పుత్రుడు గాదు. ఇట్టి సత్యాన్ని గుర్తించలేక కేవలము పదములు మాత్రము వల్లిస్తూ వుంటున్నాము. అమృతస్య పుత్రః అంటే యేమిటి దీని అర్థము. ఎప్పుడు అమృత పుత్రుడౌతాడు. క్షేత్ర క్షేత్రజ్ఞుల యొక్క రహస్యాన్ని ఎవడు గుర్తిస్తాడో వాడే అమృత పుత్రుడు. క్షేత్రము దేహము. దేహమును గురించి చక్కగా మనము విచారించాలి. మలమూత్ర దుర్గంధ మాంస రక్తముతోగాని యిందులో యే మాత్రము సరైన మంచి పదార్థములు లేవు.

పొట్ట చూచిన మలమూత్ర తొట్టెసుమ్మి
దేహమంతయు దుర్గంధ డబ్బసుమ్మి
ఆత్మకీ దేహము అది ఒక వింత అద్దెకొంప.

ఈ వింత అద్దెకొంప యీ ఆత్మకు దేహము. కనుకనే దీనిని

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకే గంప జాతసం
చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం
బులపాది రెమ్మ చూడ వసి మెప్పు దలంపగ దేహమింకని
శ్చలమని నమ్మబోకు మనసా హరి పాదము లాశ్రయింపవే.

ఈ దేహాన్ని మనము చక్కగా విచారణ చేస్తే, ఈ శరీరాన్ని మనము చక్కగా విచారణ

318108805

చేస్తే యీ దేహమునైన యేవిధమైన భ్రమ లేకుండా ఒక రోత పుడుతుంది.

నిమిష నిమిషంబునకు నీచు టారునెగాని
పునుగు జవాదులు పుట్టబోవు.

అయితే యీ దేహమును మనము అలక్ష్యము చేయరాదు. ధర్మాచరణ నిమిత్తమై అందిం
చిన పని ముట్టు కనుక యీ పని ముట్టుకు తగిన భద్రతను మనము చూచుకోవాలి.
అయితే యిట్టిదనే సత్యాన్ని గుర్తించటము అత్యవసరము. కనుక దేహము యొక్క రహస్యా
న్ని, దేహము యొక్క పవిత్రతను మనము విచారించటము యిదే క్షేత్రము యొక్క
విచారణ. క్షేత్రజ్ఞుడు తానే ఆత్మ స్వరూపుడు. దేహము మృణ్మయము. క్షేత్రజ్ఞుడు చిన్మ
యము. కనుకనే యీ మృణ్మయమైన దేహములో చిన్మయమైన పరమాత్మ వుంటున్నాడు.

విలువ లేని యినుపపెట్టె యీ దేహంబు
పెట్టిలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మ దేవుడుండెను సుమా.

మన వజ్ర వైడూర్య మరకత మాణిక్య పుష్యరాగాలతో కూడిన విలువైన నగలు కూడా ఎక్క
డ పెడుతున్నాం, బంగారు పెట్టెలో పెడుతున్నామా కాదు యినుపపెట్టెలో పెడుతున్నాము
పెట్టెకు విలువ లేదు. కానీ దానిలో వున్న నగలకు విలువ వుంటుందాది. అదే విధముగానే
దేహము ఒక యినుప పెట్టె వంటిది. దీనికంతా dust పడుతుంటాది. Rust పడుతుం
ది. Burst అవుతుంటాది. Rest యిస్తూ వుంటాము. అన్నీ దీనికే యీ వ్యాధులంతా. కానీ
అందులో పెట్టిన విలువైన నగలు వున్నాయి. అవే సత్ చిత్ ఆనందము.

అట్టి సత్ చిత్ ఆనందమును మనము గుర్తించే నిమిత్తమై యితనిని మ
నము ప్రేమించాలి. ఆ ప్రేమ కేవలము స్వార్థమైనది కాకుండా, స్వప్రయోజనమైనది కాకుండా
విశాలమైనదిగా వుంటుండాలి. భగవంతుని ప్రేమించటానికి పూర్వము తనను తాను
ప్రేమించుకోవాలి. తనను తాను ప్రేమించుకున్న తరువాత సమాజాన్ని ప్రేమించాలి. తరు
వాత యీ జగత్తునే ప్రేమించాలి. స్వార్థరహితమైన ప్రేమ లేకుండా వుండినప్పుడు
జగత్తును మనము ప్రేమించలేము. ప్రపంచమును ప్రేమించలేని వాడు పరమాత్మని
ప్రేమించలేడు. మొట్టమొదట జగత్తును ప్రేమించు. తదుపరి జగదీశ్వరుని ప్రేమిం
చవచ్చు. కనుక తనను తన సమాజమును తన తోటి వారలను ప్రేమించటానికి మాన
వుడు ప్రయత్నించాలి. ప్రేమ వున్న చోట ద్వేషము వుండదు. ద్వేషము లేని చోట ప్రేమ
నే వుంటుంటాది. వున్నవి రెండే ప్రేమ, ద్వేషము. ద్వేషము అహంకారమును పెంచు
తుంది. ఆడంబరమును పెంచుతుంది. ప్రేమ సహనాన్ని పెంచుతుంది. సాను
భూతిని చూపుతుంది. కనుక భగవత్ దృష్టిలోపల మానవ సృష్టి చాలా ఆశ్చర్య
మైనది. ఇది విశ్వవ్యాప్తి గావించే నిమిత్తమై యీ ప్రేమను పరులకు అంటా సరియైన
రీతిలో అందిచ్చే నిమిత్తమై దీనిని ఒక కుటుంబరీతిగా పోషించుకుంటూవచ్చారు.

318108806

మానవుడు మొట్టమొదట పుట్టిన తక్షణమే తన ఆకలి, తన నిద్ర, తన బాధను మాత్రమే తాను గుర్తిస్తాడు. అందరికీ తెలిసిన విషయమే. పుట్టిన బిడ్డ తన నిద్ర, తన ఆకలి, తన యొక్క బాధ యిది తప్ప అన్యము యేమాత్రము యెరుగదు. ఆకలైతే ఏడుస్తుంది. మాత్రగుతే నిద్ర పోతుంది. ఇది పెరుగుతూ పెరుగుతూ అమ్మతో సంబంధము గావించుకుంటుంది. తన నుండి తల్లి వరకు ప్రవేశిస్తుంది. ఇది తదుపరి పెరుగుతూ పెరుగుతూ తల్లి నుంచి అక్క, అన్న తండ్రి యీ ముగ్గురి పైన ప్రేమను ప్రసరిస్తుంది. ఇంకా కొంత పెరుగుతూ పెరుగుతూ తన సహచరులపైన, స్నేహితులపైన యీ ప్రేమ ప్రసరింపచేస్తుంది. ఇంక పూర్తి పెరిగిన తరువాత పెండ్లి అవుతుంది. ఈ పెండ్లి అయిన తరువాత కుటుంబము పైన కూడను యీ ప్రేమ ప్రసరిస్తుంది. వాళ్ళ బావమరదులు ఇంకను యిలాంటి వారంతా కూడను వారితో ప్రేమను పెంచుకుంటాడు. తదుపరి తనకు తగిన కుమారులు కలుగుతారు. ఆ కుమారులకు పెండ్లయిన తరువాత కొత్త కుటుంబముపైన ప్రేమ పెరుగుతూ పోతుంది. ఈ విధముగా కేవలము స్వార్థముతో ప్రారంభమైన ప్రేమ ఎంత విశాలముగా పెరుగుతూ పోతున్నది. ఈ విధముగా ప్రేమను పెంచుకునే నిమిత్తము మనకు సంసారము ప్రసాదించాడే గాని స్వార్థ స్వప్రయోజనముతో కేవలము కూపస్థ మండూకము వలె అందులో పడి వుండటం కోసం కాదు. మానవుని యొక్క జీవితము ప్రసాదించి వుండేది.

ఈ ప్రేమ పెరుగు కొలది హృదయము చాలా విశాలమై పోతుంది. రాను విశాలము గావిస్తుంది హృదయాన్ని. మన సంస్కారాన్ని సంస్కరింపచేస్తుంది ప్రేమ. సత్యములో ప్రవేశిస్తుంది ప్రేమ. సానుభూతి చూపుతుంది ప్రేమ. పరుల బాధను చూచి తాను కూడా బాధపడతాడు. ఇలాంటి హృదయ విశాలతను గావించుకునే నిమిత్తమై యీ భక్తి అనే శక్తి స్వరూపము మనకు అందించారు. కనుకనే మానవత్వములో భక్తి అనేది ప్రధానమైన ప్రాణము వంటిది.

భక్తిరేవ పరమార్థదాయిని భక్తిరేవ భవరోగనాశని
భక్తిరేవ పరవేదన ప్రదా భక్తిరేవ పరమోక్షప్రదాయిని.

పరమార్థమైన జ్ఞానమును ప్రసాదించేది భక్తి. భవరోగమును నాశనము చేసేది భక్తియే. పవిత్రమైన పరతత్వాన్ని అందించేది భక్తియే. ఇదియే మోహక్షయము గావించి భగవత్ సన్నిధి అనే మోక్షమును చేకూర్చేది భక్తియే. ఇలాంటి పవిత్రమైన భక్తి చేతనే భగవంతుని పొందటానికి ప్రయత్నించాలి. ఒక చిన్న ఉదాహరణము. ఒక పంజరములో ఒక చిలుకను వుంచినప్పుడు లేక ఒక బోనులో ఒక పులిని పెట్టినప్పుడు దానిని నిత్యము మనము చూస్తూ వుంటే అంత ఆనందము మనలో ఆవిర్భవించదు. ఆ పులినే సహజమైన వనములో వదలిపెట్టి అది సహజముగా సంచరిస్తుంటే యెంతో ఘుంభీరమైన నడక నడుస్తుంటే మనకు

318108807

ఆనందము పుట్టిపడుతుంది. ఒక పక్షిని ఎవరు చేతిలో పట్టుకున్నారో ఆ పక్షి పైనే వానికి ఆనందము కలుగుతుంది. ఇష్టము కలుగుతుంది. పక్షిని పట్టిన వానికి అన్ని పక్షులు నావే అనే ఆనందము అనుభవిస్తాడు. అనగా మానవుని యొక్క సహజ ప్రేమ విశాలమైన మార్గములో ప్రవేశించాలి. ఒక పంజరములో వుండినట్లుగా మన యొక్క ప్రేమను ఒక పరిధిని మాత్రమే నిర్ణయించరాదు. మన ప్రేమ కొండను పరిధులు దాటి ప్రసరించాలి. అదియే విశ్వప్రేమగా రూపొందుతుంది. కనుక మొట్టమొదట నామము పైన అభిరుచి కలగాలి. సమాజము పైన దయాప్రేమలు పెంచాలి. అదే విష్ణుసేవగా మారిపోతుంది. అనగా సర్వవ్యాపకమైన సేవగా మారుతుంది. కనుక మన ప్రేమ తత్వాన్ని మనము విశాలము గావించుకోటానికి సరియైన మార్గము నామస్మరణాయే. ఈ నామస్మరణ చేత మనము మన హృదయాన్ని విశాలమైనదిగా రూపొందింప చేసుకోవాలి.

భక్తికి మించినది యీ జగత్తునందు మరొకటి కానరాదు. దీనిని మరొక వస్తువుతో పోల్చుటకు వీలు లేదు. ఎక్కడ చూచినప్పటికి దీనిని పోల్చ పదార్థము మనకు కానరాదు. అమృతము, మధురము, మధురాతి మధురము అనుకుంటాము. కానీ ప్రేమతో పోల్చి చూస్తే అమృతమంతా చప్పిడి నీరుగా వుంటుంది. కనుక భగవత్ప్రేమ అనేది మహా పవిత్రమైనది మధురమైనది.

వచనం మధురం శ్రవణం మధురం
నయనం మధురం హృదయం మధురం
మధురాధిపతే మధురం మధురం

ఇలాంటి మధురమైన ఫలమును వదలి నిరంతరము మనకు బాధలనందించే యీ ప్రకృతమైన ఫలమును కోరుకోటం యెంతటి అవివేకము. భగవంతుని ఖజానాలో, భగవంతుని ధనాగారములో ఎలాంటి విలువైన రత్నాలున్నాయో ఎవరికి తెలియదు. అతను నీకు యేది ఇవ్వాలని సంకల్పించుకుంటున్నాడో అది నీకు తెలియదు. అది తెలుసుకోనక ఆట బొమ్మలను మనము ఆడుకుంటున్నాము. అన్నీ అతనికే వదలిపెడితే ఏ సమయములో యేది మనకు అనుగ్రహించాలో తానే అనుగ్రహిస్తాడు. కనుక కల్పవృక్షము దగ్గర పోయి కొంత పాడిని కోరినట్లుగా మనము యీ అల్పమైన విషయములను మనము కోరరాదు. మానవునకు కష్టములు, సుఖములు అభీష్టములు కొందను వలుంటలు తామే నెరవేరుతుంటాయి. స్వామి మా కష్టములు భగవంతుని అడక్కపోతే ఎట్లా తీరేది అని భ్రమించనక్కర లేదు. మీ మంచి చెడ్డలు మీరు చేసే కర్మల పైనే ఆధారపడి వున్నాయి. మంచి చేస్తే మంచి ఫలితము. చెడ్డ చేస్తే చెడ్డ ఫలితము. ఇది భగవంతుని అడగనక్కర లేదు. ఏది చేస్తామో అదే అందిస్తాడు

ఇది చేత అది చేతు ఇంకెన్ని యీ చేతు
నను చూ పూవాలు అల్లి అలసి పోకు

318108808

ఏ విత్తులను నాటి యుత్సాహ మంటిరో
ఆ ఫలంబులె మీకు అందు చుండు
విత్తన మొకటైన వేరైన ఫలములు
సంభవించుట యెట్లు సాధ్యమగును
ఎన్ని చేసిన అవి యన్ని ఎంచి ఎంచి
మంచి యైన చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చె పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల.

కనుక మనము నిమ్మచెట్టు నాటి మామిడి ఫలము కావాలంటే అది మనకు లభించదు. లేక మామిడి విత్తనము నాటి పనస పండు కావాలంటే మనకు లభించదు. దేనిని నాటుదుమో ఆ ఫలములనే మనము అనుభవించవలసి వస్తుంది. కనుక ఫలనిమిత్తమై మనము ప్రార్థిస్తే మనము యేమి నాటినామో, ఏమి చేశామో అవే ఫలములు మనకు వస్తుంటాయి. ఫలములను మనము ఆశించక నిజమైన ఫలమైన ఆనామ ఫలమునే, ఆనామరసమునే ఆశించినామంటే మనము కోరిన వన్నీ లభిస్తాయి. కనుక దైవాన్ని మనము కోరితిమంటే సర్వమైన అభీష్టములు నెరవేరుతాయి. దైవమును కోరక దయ్యము వంటి లోకాన్ని కోరితే యీ దయ్యము వంటి లోకము మనలను పట్టి పీడిస్తుంది తప్పదు. కనుక మీరు కోరవలసినది ఒక్క దైవమునే. అందుకోవలసినది ఒక్క దైవప్రేమనే. ఆచరించవలసినది దైవనామ స్మరణే.

ఈ నామస్మరణ అనే సముద్రమును చక్కగా చిలికినప్పుడు యిందుమండియే యీ ప్రేమ అనే ఫలము లభిస్తుంది. సకల వేద సంగ్రహమైన, సమ్మిళితమైన రసమే యీ దివ్యమైన రసము. సకల శాస్త్రములు మథించి అందించిన సుధానిధియే యీ ప్రేమ. లౌకిక ప్రేమలవలె యిది క్రమక్రమేణా సన్నగిల్లిపోదు. పల్చబడదు. లౌకిక ప్రేమ క్రమక్రమేణా దినములు గడిచేకొద్ది ప్రేమ తరిగి పోతుంటుంది. నేను అనేక పర్యాయములు మా పిల్లలకు చెప్పుతూ వుంటాను. దివ్యమైన దైవప్రేమకును అనిత్యము, అశాశ్వతము, అల్పమైన జగత్ప్రేమకును వుండిన సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని తేడా భేదములను మనము చక్కగా గుర్తించాలి. ఈనాటి ఆధునిక యుగమందు ఒక యువకుడు తనకిష్టమైన కన్నను పెండ్లాడినాడు. పెండ్లి అయిన తక్షణము తన యొక్క wife lifeగా భావించుకున్నాడు. కనుక ఒక సాయంకాలము లాల్ బాగ్, పబ్లిక్ పార్కులో walkingకోసము వెడుతున్నారు. పాపము ఎక్కడ తప్పించుకొని పోతుందో, యీ గుంపులో యేవిధముగా విభాగమైపోతామనో చేయి పట్టుకొని వెడుతున్నాడు. వానికి ప్రపంచమే కనుపించలేదు. భార్య తప్ప వానికి యేమాత్రము చూడటానికి వీలులేదు. అలాంటి సమయములోపల దారి నడుస్తుంటే దారిలో ఒక ముల్లు కనుపించింది యువతి కంటికి. ముల్లు చూచిన తక్షణమే

318108809

ప్రాణ ప్రమాణమైన భార్య ఆముళ్ళపైన యెక్కడ అడుగు పెడుతుందేమోనని ముళ్ళుముళ్ళు ఏరి లోగేశాడు. అంత అభిమానము. అంతగాఢమైన ప్రేమ. ఈ విధముగా ఆరునెలలు గడచింది. తమ పరిమళాక బోచూపైన వెడుతున్నారు. అక్కడ కూడను ముళ్లు కనుపించింది పాపం. కానీ అంత ఆతృత యితనిలో లేదు యిప్పుడు. అక్కడ ముళ్లుంది జాగ్రత్త అన్నాడు. ఇట్లనే యింకొక ఆరునెలలు గడచింది. సంవత్సరమైన తరువాత మరొక మార్గములో ప్రయాణము పెడుతున్నారు. అక్కడ కూడను యితనికి ముళ్ళు కనుపించింది పాపం. ఈమె నడుస్తూ లో కండ్లు కనుపించటం లేదా ముండ్లు వున్నాయన్నాడు. పెండ్లి అయిన కొత్తలో ఎంత ప్రేమగా వుండినాడు ఒక సంవత్సరము అయ్యేసరికి యీ ప్రేమ ఎంతగా మారిపోయింది. ఈ ప్రాకృతమైన ప్రేమకు పరమాత్మ ప్రేమకు వుండిన వ్యత్యాసము.

పరమాత్మ ప్రేమ అమృతమయమైనది. దీనికి తరగటము పెరగటము రెండును లేవు. అదే పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే అని అదే పూర్ణమైనది. అదే పరిపూర్ణమైనది. అట్టి పరిపూర్ణప్రేమ నిమిత్తమై మనము పాటుపడాలి గాని యీ జగత్సంబంధమైన ప్రేమ నిమిత్తమై ప్రాకులాడి మన జీవితమును దుఃఖము పాలు చేసుకోనక్కరలేదు. ఎత్తే మన కర్తవ్యమును నిర్వర్తించాలి. కాయము వుండినంత వరకు సర్వులను ప్రేమించాలి. ఇది అందరికి సాధ్యమయ్యేది కాదు. కాదని నిరాశ చెందనక్కరలేదు. ఏదో ప్రయత్నమైనా చేస్తూ చేస్తూ వుంటే తప్పక ఆ స్థితికి మనము రాగలము ఒక చీమ నడచటానికి యిష్టపడితే మైళ్ళ దూరము నడచి పోతుంది. ఒక గ్రద్ద ఎగరటానికి యిష్టము లేకపోతే ఒక యించైనా ముందుకు పోలేదు. కనుక మనలో వుండిన యిష్టశక్తిని అభివృద్ధి పరచుకొని దైవప్రేమను పొందుటకై, దైవసన్నిధిని వుండుటకై తగిన కృషి చెయ్యాలి. అప్పుడే మన జీవితము ధన్యమవుతుంది. మనకు అందించిన దేహాలు సార్థకమవుతుంది.

ప్రేమస్వరూపులారా! మన కాయమును, మన కర్ణులను, మన కాలమును కూడను భగవదర్పితముగావించి సేవలో పాల్గొనాలని, సేవనే భగవత్సేవగా మనము విశ్వసించాలి. మనము శాశ్వతమైన పెన్నిధి పొందాలి. భగవంతునికి సేవ చేయటమే నిజమైన ప్రేమ, తన సేవను ప్రకృతికి అందించటమే ప్రేమ. సర్వుల యందుండిన తనను సేవించుటయే ప్రేమ. భగవంతుడు అందరికంటె సన్నిహితుడు. అందరికంటె సన్నిహిత మిత్రుడు. ఇలాంటి మిత్రుని పొందవలసిన మీరు తప్పించుకొని, తాత్కాలికమైన తళుకులలో బెళుకులలో చూచి మిత్రులను మీరు ఆశ్రయిస్తున్నారు. ఎవరు మీకు మిత్రులు. ఈ జగత్తులో యీకాలములో, యిప్పటి పరిస్థితులలో సరైన మిత్రులు మనకు యేమాత్రము కనుపించటము లేదు. నీ జేబులో ఏమైనా కొంత డబ్బు వుండా, నీ తండ్రి మంచి అధికార స్థితి మినిష్టరు స్థితిలో అందరూ హలో హలో అని వస్తారు. నీ జేబిలో డబ్బులేదా నీ తండ్రి ఆ స్థితిలోను కనుపించడో ఎవ్వరు కూడ good bye కూడ చెప్పడు.

చెరువులో నీరు వుండినంతవరకు వేల కప్పలు వచ్చి చేరిపోతాయి. కాని నీరు యెండిపోయిన ఒక్క కప్ప అయినా ఎక్కడ కనుపించదు. అట్లనే ఈనాటి మిత్రులు. కాని భగవంతుడే నిజమైన మిత్రుడు వెంటనే జంటనే యింటనే కంటనే వుంటుండి ఏకాలము నందైనను నిన్ను వదలక వుంటాడు. కనుక నిజమైన మిత్రుడు భగవంతుడే అని విశ్వసించి అతనిని అనుసరించటానికి ప్రయత్నించండి. అదియే సార్థక మార్గమునకు సరైన రాజబాట. నామస్మరణ చేత కాలము సార్థకము గావించుకోండి. పరోపకార సంబంధమైన సేవల చేత కాయమును సార్థకము గావించుకోండి. ఇతరుల యొక్క మంచిని కోరి లోక కల్యాణ నిమిత్తమై నిరంతరము లోకాస్సమస్తా సుఖినో భవంతు అనే చిత్తాన్ని బలపరచుకోండి. అప్పుడే త్రికరణ శుద్ధి యేర్పడుతుంది. ఈ త్రికరణ శుద్ధియే పరమాత్మని పొందటానికి సరియైన స్థితి. కనుక నామాన్ని ఎక్కువగా వుచ్చరించండి. అనవసరముగా కాలమును వ్యర్థము చేయకండి. కాలము భగవత్ స్వరూపము. చేతనైనంతవరకు పరులకు వుపకారము గావించే కార్యములలో ప్రవేశించండి. ఇంతకంటె నిజమైన సాధన, యింతకంటె పవిత్రమైన పూజ మరొక్కటి లేదు. అనంతమైన పరమాత్మను పొలోటు తీసుకువచ్చి దానికి ప్రేమ కట్టి నీవు జరూములో పెట్టి పూజించనక్కర లేదు. ఆ పరమాత్మను నీ హృదయములో పెట్టి పూజించు. ఈ బాహ్యమైన పూజల చేత యేనాటికైనా కూడను మనకు భంగము కలుగవచ్చును.

మీరా పరమ భక్తురాలు. ఆమెకు కృష్ణుడు తప్ప అన్యులు యేమాత్రము జగత్తులో కనుపించలేదు. కాని ఆమెలో ఒక భవ్యమైన ఆశ వుండేది. నా కృష్ణుని చలువరాతి కృష్ణునిగా రూపొందింప చేసుకొని దానికి ఒక చిన్న మందిరము కట్టి ఆ మందిరములో నా కృష్ణుని ప్రతిష్ఠింప చేసుకొని యిరువది నాలుగు గంటలసేపు నా కృష్ణుని గానము చేత ఆనందాన్ని అందులో వుంచాలని ఆశించింది. ఐతే ఈ మందిరము కట్టేదెవరు! ఇది నా చేత కాదే నా ఆశ నెరవేరుతుందా? నా జన్మలో దానిని నేను అనుభవించగలనా అని సందేహము కల్గి వుండేది. కాని ఒకానొక సమయములో మహారాణా వచ్చాడు. మహారాణా మీరాను పెండ్లి చేసుకోవాలని ఆశించాడు. కాని ఈమెకు పెండ్లి అంటే యేమిటో బొమ్మలాటగా భావించి ముఖ్యమైన లక్ష్యమును తాను గుర్తింప చేసుకుంది. ఇతను గొప్పవాడుగా వుంటున్నాడు శ్రీమంతుడుగా వుంటున్నాడు. ఇతనిని పెండ్లి చేసుకుంటే నా అభీష్టము నెరవేరుతుందే యేమిటో చలువరాతి మందిరము కట్టి చలువరాతి కృష్ణుని ప్రతిష్ఠింప చేసుకొని నిరంతరము కృష్ణనామము చేత నా యొక్క జీవితము ధన్యము గావించుకోవచ్చునని ఆ లక్ష్యము లోపల ఆమె మహారాణాను పెండ్లి చేసుకుంది. ఆ ఆశకు దాసురాలై పోవటం చేతనే మోసములో చిక్కుకుంది. కొంతకాలము గడచిన తరువాత మహారాణా తన యిష్టమునకు విరుద్ధముగా నడచుకోటం చేత ఆమెను మందిరము నుండి బయటకు వెళ్ళిపొమ్మన్నాడు. బయటకు వెళ్ళిపొమ్మన్న

31810881

తక్షణమే ఆమెకు ఒక షాక్ మాదిరి అయింది. చాలా భయంకరమైన దుఃఖము యేర్పడింది. తక్షణమే తనలో వున్న విజ్ఞానము ప్రజ్ఞానము సుజ్ఞానము కూడను మేలుకొలిపింది.

ఈ మందిరము మహారాజా కట్టినది. ఈ మహారాజా యీ ప్రతిష్ఠ జరిపింది. కానీ యీ మందిరము అశాశ్వతమైంది. కానీ నా హృదయ మందిరము భగవంతుని నిత్యము అందులోనే భగవంతుడు ప్రతిష్ఠయై వుంటున్నాడు. మద్భక్తా యత్ర గాయంతే తత్ర తిష్ఠామి నారద అన్నాడు. నా భక్తుడు నన్ను ఎక్కడ గానము చేస్తుంటాడో వాని హృదయమందిరము లోనే వుంటాను. భ్రూమధ్యస్థానమందు నీవు పో. అక్కడ నా కృష్ణుడు వుంటున్నాడు. ప్రత్యక్ష స్వరూపమైన సుందర విగ్రహము అక్కడ వుంటున్నది. ఓ మనసా అటూ ఇటూ నీవు పరుగెత్త నక్కరలేదు. ఎందు చూచినా నా కృష్ణుడేగాని నా యందున్న కృష్ణుడే నా ప్రేమ కృష్ణుడు. నా యొక్క సంపూర్ణమైన అభిమాన కృష్ణుడు అనే రీతిగా భావించిన. కనుక మనము కట్టిన మందిరములు, పెట్టుకున్న మందిరములో వున్న పటములు విగ్రహములు కాదు శాశ్వతమైనవి. మన హృదయ మందిరములో వున్నటు వంటివి శాశ్వతమైనవి. దీనిని ఎక్కడకు పోయినప్పటికీ నా దేహమే దేవాలయము నా హృదయమే పీఠము. ఆత్మయే నా యొక్క దేవ స్వరూపము. దానిని భద్రము చేసుకొని దానిని పరిపూర్ణ సంతృప్తి గలవై నిమిత్తమై నిరంతరము నీవు నామస్మరణలో మునుగు. లోకమంతా పిచ్చివారనుకున్నా నీవేమీ వెరువనక్కర లేదు. ఆ పిచ్చిలో వుండిన ఆనందము యీ పిచ్చివారికి యేమి తెలుస్తుంది. కనుక యీ విధమైన జీవితమును కడపలుమలోపల మీయొక్క జన్మము సార్థకము చేసుకోండి. అనవసరముగా మీరు వాదోపవాదములు వేసుకొని జాతి మత కలహములు పెట్టుకొని దివ్యమైన యీ మానవత్వము వ్యర్థము గావించుకోకండి. అందరూ భగవంతుని బిడ్డలే అందరూ అక్కచెల్లెళ్ళే. అందరియందు వున్న పదార్థము ఒక్కటే. మన తలపైనున్న ఆకాశము ఒక్కటే మనము నివసించే భూమి ఒక్కటే. మనము పీల్చుకునే గాలి ఒక్కటే. మనము త్రాగే నీరు ఒక్కటే. ఎందుకు మనకీ కక్షలు, ఎందుకు మనకీ బేధములు. ఎందుకు మనకీ ద్వేషములు. ఈ ద్వేషములు మనకక్కరలేదు ప్రేమను పెంచుకొని పరమాత్మను అనుగ్రహింప చేసుకొని తద్వారా అందులో లీనము కండి.